## మహాశివరాత్రికి సిద్ధమైన లబ్బర్తి శివాలయం



రాజవొమ్మంగి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త

మహాశివరాత్రి పూజలకు లబ్బర్తి గ్రామ సమీపంలో మదేరు వాగు ఒడ్డున రామ లింగేశ్వరస్వామి ఆలయం సిద్ధమైంది. ఆహ్లాదకర ప్రశాంత వాతావరణంలో ఈ శివాలయం ఉంది. భక్తులు స్నానాలు చేయడానికి వాగు ఉంది. లబ్బర్తి నుండి అడ్డతీగల మండలకేంద్రానికి వెళ్లే రహదారిలో ఈ రామలింగేశ్వర స్వామి ఆలయం సుమారు 50 సం క్రితం నుండి ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఆలయం ప్రక్కనే వినాయకుడు ఆలయం కూడా ఉంది. లబ్బర్తి గ్రామానికి చెందిన గిరిజన అర్చకులు మిరియాల రాంబాబు నిత్యం పూజలను చేస్తారు. మహాశివరాత్రి సందర్భంగా ఈ ఆలయం వద్ద తెల్లవారుజామునుండే పూజలు జరుగుతాయి. పూజలు అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేస్తారు. లబ్బర్తి, లాగరాయి, గడుఓకుర్తి పంచాయితీల్లో గల గ్రామాలకు చెందిన వారు రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని పూజలను చేస్తారు. ఏలేశ్వరం నుండి కాకరపాడు బస్సు సర్వీసులు ప్రతీ రోజూ రెండుసార్లు ఉన్నాయి. లబ్బర్తి గ్రామం నుండి కేవలం. రెండు కిలోమీటర్లు దూరంలో ఈ ఆలయం ఉంది. వాతంగి పంచాయితీ ఓగిపాలెం గ్రామ సమీపంలో నాగులకొండ పర్వత ప్రాంతాన్ని చేరి గృహలో ఉన్న నాగేశ్వరి సమేత ఓంకారేశ్వరస్వామి ఆలయం ఉంది. మహాశివరాత్రి సందర్భంగా ఇక్కడ పూజలు చేస్తారు. ఆలయం ప్రక్కనే వాగు ఉంది. వాతంగి, లోదొడ్డి పంచాయితీ ల భక్తులు స్వామిని దర్శించు కొని పూజలను చేస్తారు. గ్రామాలవారు ఐక్యంగా ఇక్కడ అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను చేస్తారు. ఆలయానికి చేరుకోవడానికి రహదారి సౌకర్యం ఉంది. మండలంలో రాజవొమ్మంగి, కిర్రాబు, అమ్మిరేకుల, కింద్రకాలనీ, లబ్బర్తి, జడ్డంగి, గొబ్బిలమడుగు, వాతంగి, ఓగిపాలెం, కరుదేవపాలెం, కుంతిదేవి ఆలయాలు( బలిజిపాడు, వంచంగి పంచాయితీ) మహాశివరాత్రి పూజలకు సిద్ధమయ్యాయి.

## పోలవరం జిల్లా కేంద్రానికి ఉదయం బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలి

### వైస్సార్సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు ఈకా శ్రీనివాస్

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త



పోలవరం జిల్లా కేంద్రమైన రంపచోడవరంకు ప్రతీ రోజు రాజవొమ్మంగి నుండి ఉదయం అరుగంటలకు బస్సు సర్వీసు ను నడిపేలా గోకవరం ఆర్టీసీ డిపో మేనేజర్ ను రాజవొమ్మంగి మండల వైస్సార్సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు ఈ కా శ్రీనివాస్ కోరుతున్నారు. ప్రతీ రోజు రాత్రి అరుగంటలకు రంపచోడవరం నుండి గంగవరం, అడ్డతీగల మీదుగా రాజవొమ్మంగి చేరుకొని, మరుసటి రోజు ఉదయాన్నే బస్సు సర్వీసు కొనసాగించడం వల్ల జిల్లా కేంద్ర ఆఫీసులకు వెళ్లే వారికి ఉపయోగమని అన్నారు. రాజవొమ్మంగి నుండి అడ్డతీగల, వై. రామవరం, గంగవరం, రాజమండ్రి వెళ్లే ప్రయాణికులు, ఉద్యోగులకు ఈ సర్వీసు ఉపయోగకరంగా ఉంటుందని ఈకా శ్రీనివాస్ ఆర్టీసీ డిపో మేనేజర్ ను విన్నవించుకొంటున్నారు.

## దేశ వ్యాప్త సమ్మెపై ప్రచార ప్రారంభం



రాజవొమ్మంగి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త

ఈ నెల 12తేదీన గురువారం జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయా లంటూ మంగళ వారం రాజవొమ్మంగి మండల కేంద్రంలో సి.ఐ. టి. యు మండల కన్వీనర్ కలింకోట వెంకటలక్ష్మి ఆటో ప్రచార జాతాను జెండా ఊపి ప్రచారాన్ని ప్రారంబిం చారు. ఈసందర్బంగా సి. ఐ. టి. యు. మండల కో కన్వీనర్ తాటితూరి శ్రీనివాస్ మాట్లాడుతూ లేబర్ కోడ్ ను రద్దు చేయాలని చేపట్టిన సమ్మె లో కార్మిక, కర్షక, ఉద్యోగ సంఘాల్లో ప్రతీ ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆటో ప్రచార జాతా రాజవొమ్మంగి, దూసరపాము, నెల్లిమెట్ల, లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల్లో ప్రచారం సాగింది. ఈ కార్యక్రమంలో కలింకోట వెంకటలక్ష్మి సిఐటియు మండల కో కన్వీనర్ తాటితూరి శ్రీనివాస్, సిఐటియు మండల కన్వీనర్ సిఐటియు నాయకులు రమణమ్మ, సత్యవతి, నూకరత్నం, భవాని, నూకరత్నం, లక్ష్మి ,భవన కార్మికసంఘం అప్పారావు, బుజ్జి, బాబూరావు పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు మరిడియ్య, దానియేలు పాల్గొన్నారు.

## గర్భిణీలకు వైద్య పరీక్షలు : ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త



జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం డా. నాగార్జున నాలుగు పంచాయితీ లకు చెందిన 35 మంది గర్భిణీలకు వైద్య పరీక్షలు చేశారు. హెచ్. బి, శిశువు కదలికలు, షుగరుతో బాటు తొమ్మిది రకాల వైద్య పరీక్షలను చేయడం జరిగింది. అనంతరం అవగాహన కార్యక్రమం ను నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్.విలు నీలాద్రి లక్ష్మీ, భూముల వెంకటరమణలు మాట్లాడుతూ ఆకుకూరలుతో ఆహారం తీసుకోవాలన్నారు. ఐరన్ మాత్రలు వేసుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలు వస్తే గ్రామస్థాయిలో ప్రాదమిక వైద్యసేవలు పొందాలన్నారు. అప్పటికీ తగ్గకపోతే పి. హెచ్. సి కి రావాలన్నారు. ప్రసవానికి ముందే ప్రభుత్వ ఆసుపత్రికి రావాలంటూ ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో డా. నాగార్జున, యం. పి. హెచ్. ఐ. ఓ గొడుగు నాగవాసు, హెచ్. విలు ఎన్. లక్ష్మీ, బి. వెంకటరమణ, యం. ఎల్. హెచ్. పీలు, ఏ. ఎన్. యం లు మురళీ, సుజాత, బి. లక్ష్మీ, యం. కుమారి, గంగాభవాని, యం. కొండమ్మ, యం. కన్నయ్యమ్మ, అంగన్వాడీ వర్కర్స్ కాంతమ్మ, కె. రమాదేవి, ఎస్. వర లక్ష్మీ, యం. రాణి, ఆర్. మార్తమ్మ, పి. నాగమణి, ఆశవర్కర్స్, వంచంగి, చికిలింత, లోదొడ్డి, వాతంగి గ్రామాలకు చెందిన గర్భిణీలు 35 మంది పాల్గొన్నారు.

## కోడి పందాల స్థావరంపై దాడి -ఆరుగురు వ్యక్తుల అరెస్ట్

నక్కపల్లి/ ఎస్ రాయవరం

మండలంలోని పి.కె.గ్రామం శివారులో అనధికారికంగా కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు అందిన నమ్మదగిన సమాచారం మేరకు, మంగళవారంఎస్.ఐ. రమేష్ మరియు సిబ్బంది ఆకస్మిక దాడి నిర్వహించారు. కోడి పందాలు ఆడుతున్న 06 గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పందెంలో ఉన్న 03 కోళ్లు.పందెం సొమ్ము రూ.2,600 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్.ఐ. రమేష్ గారు మాట్లాడుతూ.. గ్రామాల్లో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం, కోడి పందాల వంటి సామాజిక రుగ్మతలకు దూరంగా ఉండాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాలు చట్టం చేయడానికి టిఏసిలో తీర్మానం చేయాలి

### - ఆదివాసి జెఏసి అల్లూరి జిల్లా ఛైర్మన్ రామారావు దొర డిమాండ్



పాడేరు,ఫిబ్రవరి10,ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివాసీలకు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయడానికి జరగనున్న 114 వ టిఏసి సమావేశపు ఎజెండాలో చేర్చి తీర్మానం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఏసి అల్లూరి జిల్లా ఛైర్మన్ రామారావు దొర డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లు గడుస్తున్నా చంద్రబాబు మాటిచ్చి మాట ప్రకారం షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకల చట్టం చేయడానికి ఇంతవరకు చర్యలు తీసుకోలేదని, చట్టం చేయడంలో తాత్సారం చేసినకొద్ది ఆదివాసీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని రామారావు దొర ఆవేదన వ్యక్తం చేశారు. మెగా డిఎస్సిలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసులకు దక్కవలసిన సుమారు 5 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు కోల్పోయమని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించిన రాబోయే డిఎస్సిలో మరోమారు అన్యాయం జరగనుందని అన్నారు. ఆలా జరగకుండా ఉండాలంటే చట్టం చేయడానికి రేపటి టిఏసి సమావేశంలో తీర్మానం చేయాలని కోరారు. ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ (టి ఏ సి) ఆదివాసుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన మినీ రాజ్యాంగమని, అందులో సభ్యులుగా ఉన్న ఎమ్మెల్యేలు, మిగతా సభ్యులపై గురుతరమైన భాద్యత ఉందన్నారు. అలాగే 1/70 భూ బదలాయింపు నిషేధ చట్టం రద్దుకు సుప్రీంకోర్టులో దాఖలైన 1580/2023 కేసులలో ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఇంప్లిడ్ పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 3 పై సుప్రీంకోర్టు కేసులో కేసు విజిపోవడానికి ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమైందని, 1/70 విషయంలో ఆలా జరగడానికి వీల్లేదని హెచ్చరించారు. రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటు చేసిన పోలవరం జిల్లాకు, ఏలూరు జిల్లాలోని షెడ్యూల్ ప్రాంతాన్ని కలిపి జిల్లాకు కారం తమన్న దొర పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకల చట్టం చేయడానికి, పిఏసిలో తీర్మాణం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ చేపట్టిన ఆదివాసి సత్యాగ్రహ యాత్రలో భాగంగా ట్రైబల్ వెల్ఫేర్ మినిస్టర్ గుమ్మడి సంధ్యారాణి కి, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు ఇదివరకే తెలియజేశామనీ రామారావు దొర తెలిపారు.

## 12న దేశవ్యాప్త సమ్మెకు పిలుపు



గూడెం కొత్త వీధి, ఫిబ్రవరి 10 (ప్రభాతవార్త):

ఫిబ్రవరి 12వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులు, శానిటేషన్ కార్మికులు సమ్మెలో పాల్గొంటారని యూనియన్ మండల అధ్యక్షులు కింతర్ల కుమారి తెలిపారు. ఈ మేరకు గూడెం కొత్త వీధి మండలం ఎంఈఓ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రమాద బీమా సౌకర్యం కల్పించడంతో పాటు పథకాలను ప్రైవేటీకరణకు అప్పగించరాదని స్పష్టం చేశారు. రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులను వెంటనే నిలిపివేయాలని కోరారు.కేంద్ర బడ్జెట్లో మధ్యాహ్న భోజన పథకానికి తగినంత నిధులు కేటాయించాలని, శానిటేషన్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు సంభవించినప్పుడు కనీసం ప్రమాద బీమా సౌకర్యం లేకపోవడం ఆందోళనకరమని పేర్కొంటూ వెంటనే ప్రమాద బీమా అమలు చేయాలని కోరారు.ఈ సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో సుకురు గోపాల్, జె. శ్రీదేవి, చిలకమ్మ, సురిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అడవి రాజుల పండుగ మహోత్సవం...






గూడెం కొత్తవీధి ఫిబ్రవరి 10 (ప్రభాతవార్త)

ఆపదలో ఆదుకునే అడవి రాజుల. పండగను గిరిజన గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఏటా గిరిజనులు గ్రామాల సమీపంలోని అడవుల్లో అడవి రాజులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అందరూ కలిసి అక్కడే ఆహారం ఏర్పాటు చేసుకొని కలిసి భోజనం చేస్తారు. పరిసర గ్రామాల గిరిజనులను కూడా ఆహ్వానించి వారికి ఆతిథ్యం అందిస్తారు. ఈ పండగలో సాంస్కృతిక, దింసా నృత్యాలు ఆటపాటలతో గిరిజనులు సందడిగా గడుపుతారు. ఇలా మంగళవారం జీకేవీధి మండలంలోని జీకేవీధిలో పాండవులు కొలువున్నచోట రాజుల బావ పండగ నిర్వహించారు. ఈ పండుగకు జీకే విధి తహసిల్దార్ అన్నాజీరావు, ఎంపిడివో రమణ బాబు, సిఐ సుధాకర్, జీసీసీ బ్రాంచ్ మేనేజర్ రాజబాబు హాజరయ్యారు. స్థానిక గిరిజనులు వారికి ఆతిథ్యం అందించారు. అనంతరం దింసా నృత్యాలతో సందడిగా గడిపారు. ఈ గ్రామంతో పాటు పూజారిపాకలు, కాఫీబోర్డు, సాగులు, బూసులు గ్రామాల్లోనూ అడవి రాజుల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ పండగలతో మండలంలో అధ్యతిక శోభ సంతరించుకుంది.

## నాబార్డ్ -రామ్ కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం

కొయ్యూరు ఫిబ్రవరి 10 ప్రభాతవార్త



మండలంలోని బంగారు పేట గ్రామ పంచా యతీ, రాజుపేట, బట్ట పనుకులు గ్రామంలో నాబార్డ్ మాతోట ప్రాజెక్ట్--3 కింద రామ్ కీ ఫౌండేషన్ ఆధ్వర్యం లో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం మండల పశు వైద్య అధికారి డా. రాజేష్ ఆధ్వర్యంలో, పశు వైద్య సిబ్బంది, సహాయక సిబ్బంది సహకారంతో నిర్వహిం చబడింది. గ్రామానికి చెందిన ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు మరియు కోళ్లు కు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు మరియు వ్యాక్సిన్లు ఉచితంగా అందజేశారు ప్రత్యేకంగా వైరస్ ఇన్ఫెక్షన్ల కారణంగా వచ్చే వ్యాధుల నివారణపై దృష్టి సారించి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. పశువుల ఆరోగ్య సంరక్షణ, వ్యాధుల నివారణ పరిశుభ్రతపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ పశు వైద్య శిబిరం వలన గ్రామంలోని జంతు సంపద ఆరోగ్యం మెరుగుపడి, రైతుల ఆర్థిక భద్రత మరియు ఆదాయం పెరుగుతుందని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొంటూ నాబార్డ్ మరియు రామ్ కీ ఫౌండేషన్ వారికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించడంలో పశు వైద్యులు, పారా వెటర్నరీ సిబ్బంది, సహాయక సిబ్బంది ముఖ్యమైన పాత్ర పోషించి, పూర్తి సహకారం అందించారు.

## ఆటో బోల్తా- గాయాల పాలైన 9మంది వలస కూలీలు



కొయ్యూరు ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

మండలంలోని మారుమూల జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఆటో బోల్తా పడి తొమ్మిది మంది వలస కూలీలు గాయాల పాలయ్యారు. ప్రాథమిక సమాచారం మేరకు కడప ప్రాంతానికి చెందిన కూలీలు పల్లపు వెంకటేశ్వర్లు, పలపాతురి వెంకటరమణ,. రేపాని రామయ్య, రేపాని శంకర్రావు, దేరంగుల రమణ, దేరంగుల వినయ్, రేపాని ఆంజనేయులు. బురుసు జయరాం, అంతిరెడ్డి శ్రీను మండలంలోని బుదరాళ్ళ పంచాయతీ ముక్కుడుపల్లి సమీపంలో రాతికట్టు పనికి వెళ్లి, మంగళవారం సాయంత్రం తిరిగి ఆటోపై వస్తుండగా బలబద్రం దగ్గర శుద్ధ గొప్పు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో, కూలీలంతా గాయపడ్డారు. వీడు రాజేంద్రపాలెం పిహెచ్సి కి అంబులెన్స్ పై తరలించి, ప్రాథమిక చికిత్స అందించి, ఆరుగురిని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## మహాశివరాత్రి పర్వదినాన అత్యంత వైభవంగా వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం

### ఎండోమెంట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఏర్పాట్లు - చోళ రాజుల కాలంలో నిర్మించిన అతి ప్రాచీన ఆలయంగా ప్రసిద్ధి- ఇక్కడ జరిగే తిరునాళ్లకు సుదూర ప్రాంతాల నుండి రానున్న భక్తులు



కూనవరం, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :

పవిత్ర గోదావరి తీరాన చోళ రాజుల కాలంలో నిర్మిం చిన వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం పోలవరం జిల్లా కూనవరం మండ లంలో కుమార స్వామి గూడెం గ్రామ సమీపాన గుట్ట పై నుంది.ఈ ఆలయంలో మహా శివరాత్రి పర్వదినాన వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం అత్యంత వైభవంగా జరుగుతుంది.ఇక్కడ జరిగే తిరునాళ్లకు అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావడం ఆనవాయితీగా వస్తుంది.శివరాత్రి 3 రోజుల పాటు ఈ ఆలయంలో పూజలు నిర్వహిస్తారు.మహా శివరాత్రి పర్వదినాన ఉదయం నుండే ఆలయానికి భక్తులు పోటేత్తుతారు.మండలంలోని భక్తులు కాక, ఇతర మండలాల నుండి, పక్క రాష్ట్రాల నుండి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావడం ఆనవాయితీగా వస్తుంది.భక్తులు శివరాత్రి పార్వదినాన రాత్రి మొత్తం జాగారం చేసి ఇక్కడ జరిగే తిరునాళ్లను తిలకించి అర్ధరాత్రి అంటే తెల్లవారుజామున 3 గంటలకు జరిగే వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో తిలకిస్తారు. శివరాత్రి తిరునాళ్లకు ఇప్పటికే ఎండోమెంట్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఆలయాన్ని రంగులతో అలంకరించడంతో పాటు దుకాణాల కోసం పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణలు తదితర ఏర్పాట్లు వేగవంతంగా జరుగుతున్నట్లు ఎండోమెంట్ ఈఓ లక్ష్మి కుమార్, జూనియర్ అసిస్టెంట్ సాయిబాబా వెల్లడించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇక్కడ జరిగే తిరునాళ్లకు పోలీసులు శివరాత్రి రోజు ఉదయం నుండే స్వామివారి కళ్యాణం జరిగే తెల్లవార్లు విస్తృత బందోబస్తు నిర్వహించడం జరుగుతుంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తిస్థాయిలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

### ఆలయ విశిష్టత..

శివరాత్రి పర్వదినాన మూడు రోజులపాటు మాత్రమే ఈ ఆలయంలో దీప నైవేద్యాలతో పాటు వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం అత్యంత వైభవంగా జరుగుతుంది. మిగిలిన రోజులలో పూజలు ఉండవు. ఈ ఆలయం సమీపంలోనే ధ్వని బండ ఉంది. మండు వేసవిలో సైతం నీరు ఉంటుందని ఇక్కడ చెబుతుంటారు. ఈ ధ్వని బండ వద్ద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రశాంతతకు వచ్చి కూర్చుంటారని భక్తుల విశ్వాసం. ఈ ఆలయానికి ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దీనిపై వచ్చే కౌలు డబ్బు మరియు హుండీలో భక్తులు వేసే విరాళాలు, తిరునాళ్ల దుకాణాల వారు ఇచ్చే డబ్బు కార్యక్రమాలకు నిర్వహిస్తారు. ఈ ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని భక్తులు కోరుతున్నారు.

### రెండేళ్లుగా ఆలయ కమిటీ లేదు..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలైన ఈ రెండు సంవత్సరాలు ఆలయ కమిటీని ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. గతంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎండోమెంట్ అధికారులు ఉత్సవ ఏర్పాట్లు నిర్వహించేవారు. గత ఏడాది నుండి ఆలయ కమిటీ లేకపోవడంతో ఎండోమెంట్ అధికారుల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయి.

### కూనవరంలో..

శబరి, గోదావరి సంగమం సమీపాన ఉన్న శివాలయంలో శివరాత్రి పర్వదినాన శివపార్వతుల కళ్యాణం జరుగుతుంది. ఈ ఆలయంలో కూడా భక్తులు విశేషంగా హాజరై కళ్యాణాన్ని తిలకిస్తారు.

## జాతీయ సార్వత్రిక సమ్మెకు ఎపిఎన్జీవో ఉద్యోగుల సంఘీబావం

అనకాపల్లి,ఫిబ్రవరి10: ( ప్రభాత వార్త)

భారతదేశ వ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు , ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు ఫిబ్రవరి 12, 2026న నిర్వహించనున్న జాతీయ సార్వత్రిక సమ్మెకు అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య సంఘీభావం ప్రకటించింది. ఈ నేపథ్యంలో, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఫిబ్రవరి 9, 2026న నిర్వహించిన వర్చువల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సమగ్ర చర్చ అనంతరం, సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొనకపోయినా, కార్మిక--ఉద్యోగుల సముచిత హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ జాతీయ పోరాటానికి సంఘీభావం తెలియజేయాలని ఏకగ్రీవంగా తీర్మానించబడింది. ఈ మేరకు ఫిబ్రవరి 12న మధ్యాహ్నం 1.00 గంటల నుండి 2.00 గంటల వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట భోజన విరామ సమయ ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ వెల్లడించింది. తాలూకా మరియు డివిజనల్ స్థాయి కార్యవర్గాలు కూడా స్థానికంగా జరుగుతున్న కార్యక్రమాలకు సంఘం తరపున సంఘీభావం తెలియజేయాలని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పీలా రవి,ప్రధాన కార్యదర్శి జి శేషుకుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు.

## కులమతాలు లేని సమాజమే మన దేశం సైన్స్ యూనివర్స్

దుంబ్రిగూడ: ఫిబ్రవరి: 10: (ప్రభాతవార్త)




కుల మతాలు లేని సమాజమే మనదేశమని సైన్స్ తోనే మానవ మనుగడ ముందుకు సాగుతుందని దీన్ని ప్రతి ఒక్కరు అలవార్చుకుని అవగాహన చేసుకోవలసిన అవశ్యకత ఎంతైనా ఉందని, యూనివర్స్ చెప్పారు. ముఖ్యంగా విద్యావంతులైన యువతి యువకులు విశ్వ విజ్ఞాన గ్రంథం సైన్స్ నని ప్రజల్లో తీసుకెళ్లవలసిన అవశ్య కత ఉందని యూనివర్స్ సూచించారు. మన్య ప్రాంతంలోని పలు మండలాల్లో జై సైన్స్ అంటూ ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు.

## ఆనందోత్సాహాలతో వీడ్కోలు వేడుక...

గూడెం కొత్తవీధి ఫిబ్రవరి 10, ప్రభాతవార్త

మండల కేంద్రంలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం (ఫేర్వెల్) వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలతో, పాటలతో, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రమణారావు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, అలాగే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి మండల ఉన్నతాధికారులు మండలంలో గల వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్ లు తదితరులు పాల్గొన్నారు.



